


4న నారా భువనేశ్వరి భామిని రాక

ప్రజాశక్తి - భామిని

నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఈనెల 4న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి మండలానికి రానున్నట్టు టిడిపి పరిశీలకులు కోలా రంజిత్, టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక బాధతో చనిపోయిన మండలంలోని బిల్లుమడకి చెందిన బర్రి విశ్వనాధం కుటుంబం సభ్యులను భువనేశ్వరి పరామర్శించనున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో మండలం టిడిపి అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, కోరాడ రాజేష్, లోపింటి రాజేష్, బిడ్డికి ప్రసాద్, గురిబిల్లి లక్ష్మీపతి ఉన్నారు.

పార్వతీపురం పట్టణంలోని శిరియాలవీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారం



పేరుకుపోయిన చెత్తాచెదారం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్/సాలూరు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో తాగునీటి సరఫరా, విద్యుత్ విభాగాల సిబ్బంది సమ్మె ఎనిమిదో రోజుకు చేరడంతో పట్టణాల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు, తాగునీటి సరఫరా, విద్యుత్ విభాగాల సిబ్బంది సమ్మెకు దిగారు. కనీస వేతనం రూ.26వేలు చేయాలని, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. గత ఆరునెలలుగా దశలవారీగా ఆందోళనలు చేపట్టిన కార్మికులు ప్రభుత్వం స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మెకు దిగారు. దీంతో పట్టణంలో ప్రధాన కూడళ్లలో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. పెదమార్కెట్, వేణుగోపాలస్వామి వీధి, సంగీత పాఠశాల, బంగారమ్మపేట, బంగారమ్మకాలనీల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. కాలువల్లో పూడికతీతలు లేకపోవడంతో కంపుకొడుతున్న పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీలో వందమంది కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ నగరపంచాయతీలో కూడా కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఇప్పటికే మూడు విడతలుగా ప్రభుత్వం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుల మధ్య చర్చలు జరిగినా ఫలితం కనిపించలేదు. చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమ్మెను తీవ్రతరం చేయాలని కార్మికులు భావిస్తున్నారు.

పండుగ రోజుల్లో అపారిశుధ్యం

మరో వారం రోజుల్లో సంక్రాంతి పండుగ రానున్న నేపథ్యంలో కార్మికుల సమ్మె ప్రభావం పట్టణ ప్రజలపై తీవ్రంగా కనిపించే అవకాశాలు ఉన్నాయి. సంక్రాంతి వెళ్లిన వెంటనే శంబర పోలమాంబ జాతర నిర్వహించనున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుల సమ్మెతో పట్టణంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రతి రోజూ పారిశుధ్య నిర్వహణ చేసినా పట్టణంలో ఎక్కడో ఒక దగ్గర అపారిశుధ్యం కనిపిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు సమ్మె కారణంగా మరింత దిగజారే పరిస్థితి కనిపిస్తోంది. తాత్కాలిక పద్ధతిలో కార్మికులను తీసుకుని పారిశుధ్య నిర్వహణ చేయాలని మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. కానీ అది వికటించి పరిస్థితి కనిపిస్తోంది. పెరిగిన పట్టణ జనాభాకు అనుగుణంగా మున్సిపాలిటీలో కార్మికుల సంఖ్య లేకపోవడం, ఉన్న కార్మికుల సమ్మెకు దిగడంతో పారిశుధ్యం, తాగునీటి సరఫరా విద్యుత్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వం పై తీవ్ర ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.

కుంపుకొడుతున్న కాలువలు
పాలకులకు పట్టని కార్మికుల ఇబ్బందులు
సమ్మెతో ప్రజలకు తప్పని అవస్థలు

జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణ పరిధిలో గల 30 వార్డుల్లో చెత్తపేరుకుపోయింది. దీంతో వార్డులన్నీ కంపుకొడుతున్నాయి. పట్టణంలోని శిరియాల వీధి, కంగటివీధి, రాజుగారి తోట వీధి, జగన్నాధపురంతో పాటు పలు వీధుల్లో అపారిశుధ్యం లోపించింది. కార్మికుల సమ్మెతో ప్రజలు రోడ్లపైనే తమ నివాస గృహాల్లో చెత్త, వ్యర్థాలు వేయడంతో వాటిని పందులు, పశువులు, కుక్కలు, చిందరవందర చేయడంతో ఆ రహదారుల గుండా రాకపోకలు సాగించే స్థానికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో పాటు పలు వార్డుల్లో ఉన్న మురుగు కాలువలు చెత్త, వ్యర్థాలతో నిండి మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేక తీవ్రదుర్గంధం వెదజల్లుతుంది. దీంతో ఆయా వార్డుల ప్రజలు అనారోగ్యం భారిన పడే అవకాశం ఉంది. ఈ సమస్య పరిష్కరించేందుకు ప్రజారోగ్య విభాగం అధికారులు, ఆయా సచివాలయాల శానిటరీ సెక్రెటరీల పర్యవేక్షణలో పర్మినెంట్ పారిశుధ్య కార్మికులతో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సమ్మెకు పరిష్కారం చూపాలి



వారంరోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో పట్టణంలో పారిశుధ్యం అధ్వాన్నం గా మారింది. పట్టణంలోని ప్రధాన రహదారిపైనా, ప్రధాన కూడళ్లలో చెత్తకుప్పలు పేరుకుపోతున్న పరిస్థితి ఉంది. కాలువల్లో పూడికతీత లేవు. పరిస్థితి చేయి జారకముందే కార్మికుల సమ్మెకు పరిష్కారం చూపాలి. కార్మికుల న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలి.

నైన హరి రెడ్డి, సామాజిక కార్యకర్త, సాలూరు.

కాలువలు కంపుకొడుతున్నాయి



పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా పట్టణంలోని కాలువలు కంపు కొడుతున్నాయి. పూడికతీతలు లేక దోమలు వృద్ధి చెందుతున్నాయి. చెత్తలు పేరుకుపోతు న్నాయి. ప్రభుత్వం వెంటనే కార్మికుల సమ్మె విరమణ కు చొరవ తీసుకోవాలి.

పి.అయ్యప్ప, పెదకోమటి పేట నివాసి, సాలూరు

ప్రజారోగ్య వృద్ధే ప్రభుత్వ ఆశయం : కలెక్టర్

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ప్రజల ఆరోగ్యం వృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ఆశయమని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. జియ్యమ్మవలస మండలం బిజెపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. శిబిరంలోని రోగులకు అందిస్తున్న వివిధ విభాగాల వైద్య సేవలను డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ బి.జగన్నాధం ను అడిగి తెలుసుకున్నారు. వైద్యం అందిస్తున్న తీరు, పరీక్షలను పరిశీలించారు. తొలివిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆరోగ్య సమస్యలకు అందించిన వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద మెరుగైన వైద్యమందించి ఆరోగ్య ఆంధ్రా దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. వివిధ విభాగాల నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందిస్తారన్నారు. రెండో దశలో కూడా ఆరోగ్య కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు ఇంటింటిని సందర్శించి దీర్ఘకాలిక రోగులు, గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులు, చిన్నారుల సంరక్షణ తదితర అంశాలపై దృష్టి పెడతారన్నారు. అవసరమైన పరిస్థితుల్లో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఉచితంగా చికిత్స కోసం పంపిస్తారని వెల్లడించారు. రోగుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఆరోగ్య సమస్యలకు ఇచ్చే మందులను పరిశీలించారు. వైఎస్ఆర్ కంటి వెలుగు కింద నిర్వహిస్తున్న పరీక్షల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థిని, విద్యార్థులకు వడ్డించిన ఆహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.శ్రీనివాసరావు, రీసర్వే ఉప తహశీల్దార్ శివజగన్మోహన్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ శ్యామ్‌కుమార్, వైద్యులు డాక్టర్ జగదీశ్వర్ రావు, స్నిగ్న, రత్నం, ప్రధానోపాధ్యాయులు రఘురామరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని జోగింపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష(జెఎఎస్ -2) కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు మంగళవారం తనిఖీ చేశారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్ల వద్ద రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. స్పెషలిస్ట్ వైద్యుల కౌంటర్ల వద్ద రోగులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలను పరిశీలించి వారి అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోగుల చెప్పే ఆరోగ్య సమస్యలను పూర్తి స్థాయిలో తెలుసుకొని తగు చికిత్స అందజేయాలని స్పష్టం చేశారు. ల్యాబ్ కౌంటర్ వద్ద రక్త పరీక్షలను వాటి నివేదికలను పరిశీలించి హెచ్చు తగ్గులు ఉన్న వారిని పర్యవేక్షించాలన్నారు. వారానికి మించి దగ్గు ఉన్న వారికి క్షయ నిర్ధారణ పరీక్షలు ఖచ్చితంగా చేయాలన్నారు. డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు తనిఖీలను పరిశీలించి కేటరాక్ట్ సర్జరీలకు గుర్తించిన వారికి సరైన నిర్దేశం చేయాలని, కళ్ల జోళు అవసరమైన వారి వివరాలు సంబంధిత వైద్య సిబ్బంది పరిశీలనలో ఉండాలన్నారు. దీర్ఘకాలిక రోగాలు, వాటి ఆరోగ్య సూచనలు, లక్షణాలకు సంబంధించి చిత్రాలతో కూడిన ఫ్లిప్ చార్ట్‌ను అక్కడ ప్రజలకు సిహెచ్‌ఒ వివరించే విధానాన్ని పరిశీలించారు. ఫార్మసీ వద్ద మందులను, అత్యవసర మందులను పరిశీలించారు. మందులు వినియోగించే విధానాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియ జేయాలన్నారు. జెఎఎస్-2లో అందజేసిన వైద్య సేవలను ఆన్లైన్ చేయాలన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలించి, ఆవశ్యకతను గర్భిణులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు, ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, వైద్యాధికారి పి.పావని, సర్పంచ్ కె.సింహాచలం, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ సంధ్య, డాక్టర్ పవన్ కుమార్, పంచాయతీ సెక్రటరీ పైడిరాజు, సిహెచ్‌ఒ ఎస్‌వి రమణ, స్థానిక పెద్దలు, వైద్య, సచివాలయం,104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో టిటికిపాయిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఎంపిపి బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అన్ని రకాల పరీక్షలు చేయడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కె.విజయ పార్వతి, ఎంపిడిఒ కె.గీతాంజలి, వైద్యాధికారి భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మండలంలోని జీగిరాంలో ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహించిందని, కావున ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు సుభాషిని, మండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



సాలూరులో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపిపి సురేష్

5 నుండి జగనన్న ఆరోగ్య సురక్ష

వీరఘట్టం : మండలంలోని 22 గ్రామ సచివాలయాల పరిధిలోని ఈ 5నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ డి.శ్వేత తెలిపారు. ఈ మేరకు మంగళ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 5న కంబర, 12న కత్తులకవిటి, 19న నీలానగరం, 27న నడిమికెల్ల, ఫిబ్రవరి 6న హుస్సేన్ పురం, 13న నడుకూరు, 20నచిదిమి, 27న తలవరం, మార్చి15న చిట్టిపూడివలస, 22న చలివేంద్రి, 30న వీరఘట్టం- 4, ఏప్రిల్ 2నకిమ్మి, 16న పనసనందివాడ, 23న రేగులపాడు, మే3న చిన్నగొరకాలనీ, 10న వీరఘట్టం-2, 17న సంత నర్సిపురం, 24న తెట్టంగి, 31న దశమంతపురం, జూన్ 4న వండువ, 14న తూడి, 18న వీరఘట్టం-3 సచివాలయాల పరిధిలో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. జెఎఎస్ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా అందుబాటులో ఉండే ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.



మెడకు ఉరితాళ్లు బిగించుకొని నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలి


ఉరితాళ్లు బిగించుకుని సమగ్రశిక్ష ఉద్యోగులు నిరసన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల 14వరోజు సమ్మెకు చేరింది. కార్యక్రమంలో భాగంగా ఎస్ఎస్ఎ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉరితాడు బిగించుకొని, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ సమ్మెకు ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం జగన్ సర్వశిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీల మేరకు వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, అలాగే హెచ్‌ఆర్ పాలసీ అమలు, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనతో మానవ హక్కుల సంఘం జిల్లా కన్వీనర్ వంగల దాలినాయుడుతో పాటు పలువురు నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు రమేష్, లక్ష్మణరావు, భారతి, వందన, దమయంతి, పోలినాయుడు, ఈశ్వరరావు, రమేష్, భాను, దివాకర్, అప్పారావు, దేవిశ్రీ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నివారణ బాధ్యత అధికారులదే

ప్రజాశక్తి - కురుపాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ లావణ్య

బాల్య వివాహాల నివారణకు అధికారులే కీలక బాధ్యత తీసుకొని గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్‌డిఒ ఎం.లావణ్య అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మండల స్థాయి అధికారులతో బాల్యవివాహాల నివారణపై ప్రత్యేక సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవివాహాలు చేయడానికి గల కారణాలు అధికారులతో చర్చించి చిన్న వయసులో పెళ్లిళ్ల వల్ల కలిగే నష్టాలు, అనార్ధాలు గురించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లయితే తహశీల్దార్ బైండోవర్ కేసు బుక్ చేయాలని డ్రాప్ అవుట్స్ పిల్లలు గ్రామాల్లో ఉంటే ఐసిడిఎస్, విద్యాశాఖ సిబ్బంది గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకొని, కలెక్టర్‌కు బాల్యవివాహాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు నివేదికను అందించి బాల్యవివాహాల రహిత సమాజంగా ఏర్పాటు చేయడానికి అధికారులంతా సహకరించాలని అన్నారు. ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి, తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, స్థానిక ఎస్ఐ వి.షణ్ముఖరావు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

- పలుచోట్ల దున్నపోతుకు వినతులిస్తూ ఆందోళన
- నేడు భారీ నిరసన ర్యాలీ, కలెక్టరేట్ వద్ద బైఠాయింపు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రభుత్వ నిర్లక్ష్యం, అబద్ధపు, తప్పుడు ప్రచారాలకు నిరసనగా పోరాటం ఉధృతం చేసే పోరాటంలో భాగంగా అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బుధవారం నిర్వహించే భారీ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి పిలుపునిచ్చారు. మంగళవారం పార్వతీపురం ప్రాజెక్టు అధ్వర్యంలో జరుగుతున్న 22వ రోజు నిరసన శిబిరంలో కార్యకర్తలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రాజెక్టు సెక్టార్ లీడర్లు ఆఫీసులకు రావాలని, ఒటిపిలు, ఫోన్ నెంబర్లు చెప్పాలని బెదిరింపు చర్యలకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనికి నిరసనగా బుధవారం స్థానికపాత బస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ జరుగుతుందని, అనంతరం అక్కడే బైఠాయించ నున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలం లోని అన్ని మండలాల, ప్రాజెక్టుల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ అంగన్వాడి పోరాటం పై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రకటనలు మానుకోవాలని, ఐక్యంగా మొక్కవోని దీక్షతో పోరాడుతున్న సమ్మెను విచ్ఛిన్నం చేయాలనే కుట్రలు, కుతంత్రాలు ఆపాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తీవ్రతరం చేయాలని తెలిపారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, అంగన్వాడీ ప్రాజెక్ట్ నాయకులు మర్రాపు అలివేలు, సాలూరు గౌరీ మణి, కె.రాజేశ్వరి, ఎం.గౌరి, బి.సునీత, విమల, లలిత, రాజేశ్వరి, ధర్మావతి, నీలవేణి, గిరిజ, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : అంగన్వాడీల సమ్మె 22వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో మండల కేంద్రంలో గంగిరెద్దుకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. తక్షణమే ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండల నాయకులు ఎం.సావిత్రి, కృష్ణవేణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు వినూత్న రీతిలో ఎండిగడ్డి, పచ్చ గడ్డి తిని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, ప్రజానాట్య మండలి నాయకులు వై.రామారావు అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు వై.సత్యవతి, కె.శైలజ, సునీత, ఆర్.లక్ష్మి, ఎస్.అరుణ, పి.పద్మతో పాటు అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



సీతానగరంలో వినూత్న రీతిలో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కొమరాడ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని సిఐటియు నాయకులు వి.ఇందిర అన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ చేస్తున్న సమ్మె 22వ రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినూత్న రీతిలో దున్నపోతుకు వినతిపత్రం సమర్పించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రాజెక్ట్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు జిహెచ్ గౌరమ్మ, సెక్టార్ నాయకులు బి.అలివేలు, జ్యోతి, పద్మ, మల్లేశ్వరమ్మ, జయమ్మ, విస్తరాణి, భారతి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కురుపాం : అంగనవాడీల సమస్యలపై ప్రభుత్వ స్పందించకపోవడంతో వినూత్న రీతిలో అంగన్‌వాడీలు తమ సమస్యల వినతి పత్రం ఎద్దుకు అందజేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరకుమారి, ప్రాజెక్ట్ కార్యదర్శి జె.సరోజ, కురుపాం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పార్వతీదేవి, బంగారమ్మ, సరోజిని, సుగుణమ్మ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. తమ సమస్యలు వెంటనే ప్రభుత్వం పరిష్కరించకపోతే చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె 22రోజుకు చేరింది. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు బి.రాధ, ఎ.నారాయణమ్మ ఆధ్వర్యాన చేపట్టిన నిరవధిక సమ్మెలో దున్నపోతుకు వినతిని ఇస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, వరలక్ష్మి, తిరుపతమ్మ, పార్వతి, శశికళ పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట తలపెట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా దున్న పోతుకు వినతి పత్రం ఇస్తూ నిరసన తెలిపారు. వెంటనే అంగన్వాడీ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కారించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి, సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పాలకొండ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఒంటి కాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తామని, ప్రజల మద్దతుతో ఆందోళనలను తీవ్రతం చేస్తామని యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ, జిల్లా కోశాధికారి బి.అమరావతి హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు జి.జస్పీబాయి, ప్రధినిధులు జి.శారద, ఆర్.భవాని, ఎం.శ్యామల, శ్రీదేవి, సుగుణ, లలిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో దున్నపోతుకు వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీలు


కాలిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అగ్ని ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని పెదబొండపల్లిలో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 5 ఎకరాల వరి చేను కోల్పోయిన రైతు రొంపిల్లి తవిటినాయుడ్ని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధికారులతో కలిసి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత రైతు కుటుంబాన్ని తప్పకుండా ప్రభుత్వం తరపున ఆదుకుంటానని హామీ ఇచ్చారు. మండల వ్యవసాయశాఖాధికారులకు ఫోన్ చేసి తక్షణమే ప్రమాదంలో నష్టపోయిన పంట నష్ట అంచనా వేసి ప్రభుత్వానికి అత్యవసరంగా నివేదించాలని కోరారు. తాను ఉన్నతాధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి ఈనెల 10లోగా ప్రభుత్వ సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే తక్షణ సహాయం కింద తన వంతుగా ఆర్థిక సహాయం రైతుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, సర్పంచ్, ఎంపిటిసి, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న గిరిజనులు

గిరిశిఖర గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గిరి శిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శిలు బి.వాసుదేవరావు, బి.అనిల్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని వలసబల్లేరు సచివాలయం వద్ద మంగళవారం రహదారి సౌకర్యం లేని గిరిశిఖర గ్రామాలైన చాపరాయిగూడ, కొత్తగూడ గిరిజన ప్రజలతో కలిసి ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి నేటికీ 76 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ గిరిజన ప్రజల తలరాతలు మారడంలేదన్నారు. అధికారులకు గాని పాలకులకు గాని గిరిపుత్రుల సమస్యలు పట్టడం లేదని రహదారి మంజూరులో ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ పనులు ప్రారంభించడం లేదని తక్షణమే రహదారి పనులు ప్రారంభించి గిరిజనులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దుంబారావు, భోగేష్, అడ్డాయి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విశాఖలో ఒడిశాకు చెందిన బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన మృగాలను కఠిన శిక్షించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన చేశారు. బాలికల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బాధిత బాలికను అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు.

ఎపిఎస్ఇజిసి సభ్యులుగా లావణ్యకుమార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



గ్రామీణాభివృద్ధిలో అత్యంత కీలకపాత్ర పోసిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయింట్ గ్యారెంటీ కౌన్సిల్ (ఎపిఎస్ఇజిసి) బోర్డు సభ్యునిగా కురుపాం నియోజకవర్గానికి చెందిన అల్లు లావణ్యకుమార్ (రాహుల్ నాయుడు) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా రాహుల్‌నాయుడు మాట్లాడుతూ సామాన్యవర్గానికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రస్థాయి పదవి ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి రాడానికి అన్ని విధాలా ప్రోత్సహించిన వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణికి అయన కతజ్ఞతలు తెలిపారు.

వైసిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగిపేటకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు బొమ్మినేని లక్ష్మణరావు తల్లి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండల నాయకులతో కలిసి లక్ష్మణరావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, జిల్లా పార్టీ కన్వీనర్ పోల ఈశ్వరనారాయణ, జెడ్పిటిసి మామిడి బాబ్జీ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

గర్భిణులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆశా కార్యకర్తలకు ఆదేశించారు. మంగళవారం ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాల్లో పర్యటించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులను గుర్తించి ఎప్పటికప్పుడు ఆరోగ్య కేంద్రానికి వైద్య తనిఖీలకు తీసుకురావాలని సూచించారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్ధనరావు, విజయ్‌ఆనంద్, ఒ.శాంతి కుమారి, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐకు జనసేన సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక పోలీస్ స్టేషన్‌కు కొత్తగా ఎస్ఐ బాధ్యతలు చేపట్టిన ఎం.గోవిందును జనసేన మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన జానీ, సరిపల్లి అచ్యుతరావు, కర్నేని సాయిపవన్, పండు, శరన్, రఘుమండల గణేష్, కర్రి శివ, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఐ గోవిందును సన్మానిస్తున్న జనసేన కార్యకర్తలు

మాగోడు వినిపించదా?

8వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె
పలు సంఘాల సంఘీభావం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎనిమిది రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా మా గోడు వినిపించక పోవడం అన్యాయమని మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య, అవుట్సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెలో భాగంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగు సమ్మె శిబిరం వద్ద నినాదాలు ఇచ్చి తమ నిరసన తెలిపారు. కార్మికుల సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో తాము అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లయినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో సిఎం జగన్ ఇచ్చిన హామీలైన మున్సిపల్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఆప్కాస్ విధాన కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని, ఇంజినీరింగ్ వర్కర్సందరికి హెల్త్ అలవెన్స్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికులు చీపురుపల్లి సింహాచలం, పవాల గాంధీ, మామిడి శివ, బంగారు రాజేష్, గుంట్రెడ్డి గంగయ్యలు, తాడ్డి వినయ్, వంగపండు అప్పలనాయుడు, మేడిశెట్టి కృష్ణ, అరసాడ తాతబాబు, నాగవంశం మల్లేసు, బంగారు రవి, నిర్మల, ఇప్పలమ్మ, పాపులమ్మ, పడాల సంతు, వెంకన్న, సాయి, రవి, సత్తిరాజు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.


సాలూరులో చెవుల్లో పూలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుడి మృతికి సంతాపం

విజయవాడ వాంబేకాలనీకి చెందిన మున్సిపల్ కార్మికుడు పిల్లి నరసింహారావు (55) మృతికి స్థానిక మున్సిపల్ కార్మికులు సంతాపం తెలిపారు. 24 ఏళ్లుగా వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్న నర్సింహారావు ఆదివారం విజయవాడలో జరిగిన సమ్మెలో పాల్గొని, సాయంత్రం ఇంటికి వెళ్లిన తర్వాత గుండెపోటుకు గురై మరణించారు. దీంతో ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెశిబిరంలో నివాళులర్పించారు. మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.రెండు లక్షల నష్టపరిహారం చెల్లించాలని, మట్టి ఖర్చులు, పిఎఫ్ నిధులు వెంటనే ఇప్పించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు.



పార్వతీపురంలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వేణు

చెవుల్లో పూలతో కార్మికుల నిరసన

సాలూరు: మున్సిపల్ కార్మికుల సమ్మె 8వ రోజుకు చేరింది. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు చెవుల్లో పూలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ కార్మికుల సమ్మెతో పట్టణాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని చెప్పారు. మంగళవారం రాత్రి పారిశుధ్య పనులు చేపట్టేందుకు కమిషనర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రెగ్యులర్ కార్మికులతో సన్నద్ధమయ్యారు. వీరిని కాంట్రాక్టు కార్మికులు అడ్డుకున్నారు. దీంతో వారు వెనుదిరిగారు. కార్యక్రమంలో ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు, నాయకులు టి.ఇందు, పోలరాజు, స్వప్న పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో క్యాబేజీ ఆకులు, ఎండు గడ్డి తింటూ మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేసే, రెచ్చగొట్టే చర్యలను మానుకొని, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు చింతల సురేష్, విమల, శ్రీదేవి, రామకృష్ణ, వై.హరిబాబు, పి.సూరిబాబు, జి.నారాయణరావు, పి.సాయి, టి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సాగుభూములకు పట్టాలివ్వాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - సాలూరురూరల్

గిరిజనుల సాగులో ఉన్న అటవీ బంజరు అన్‌సర్వేడ్ భూములను సర్వే చేసి పట్టాలివ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం గిరిజనులు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వంతల సుందర్రావు, గెమ్మెల జానకీరావు మాట్లాడుతూ గతంలో గిరిజనులకు పట్టాలు ఇవ్వడానికి అధికారులు సర్వేలు చేశారని, అయితే నేటికీ పట్టాలు పూర్తిస్థాయిలో పట్టాలు పంపిణీ చేయలేదని తెలిపారు. అరకొర పట్టాలు పంపిణీ చేశారన్నారు. ఒకే రెవెన్యూ పరిధిలో సాగు చేస్తున్న గిరిజనులందరికీ సర్వేలు చేసి అందులో కొంతమందికి పట్టాచ్చి చేతులు దులుపుకున్నారని, మిగిలిన గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ గిరిజన రైతుల మధ్య తగాదాలు పెట్టేలా రెవెన్యూ అధికారులు చేస్తున్నారన్నారు. గిరిజన రైతుల సహనాన్ని పరీక్షిస్తున్నారని, ఇది ఎంతకాలం కొనసాగదని హెచ్చరించారు. గతంలో సర్వేలు జరిపి వచ్చిన పట్టాలను ఇప్పటి వరకు అధికారులు తమ చేతిలో ఉంచుకొని పంపిణీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా వచ్చిన పట్టాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన తీవ్రతరం చేస్తామని తెలిపారు. గతంలో సర్వే చేసిన వారందరికీ అటవీ, బంజరు భూములకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు పాల్గొని మద్దతు తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు కూనేటి చినబాబు, మర్రి మసి, వంశీ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి, సభ్యులు సిద్ధ సాయిబాబు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

అబద్ధపు హామీలతో ఎన్నాళ్లు మోసగిస్తారు : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మేనిఫెస్టో ద్వారా, అలాగే పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98శాతం అమలు చేశామని ప్రజల్ని మభ్యపెట్టి తప్పుతోవ పట్టించి మోసగించిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమని అరకు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీల కోర్కెలు గొంతెమ్మవి కాదని, ఎన్నికల సమయంలో వైసిపి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరితే ఇప్పటికీ స్పందించకుండా వారి జీవితాలతో ఆడుకోవడం తగదని అన్నారు. అధికారంలోకి రాకముందు ప్రతి ఏటా జాబ్ కేలండర్ తీస్తానని చెప్పి నాలుగున్నరేళ్లు కావస్తున్నా ఇప్పటికీ తీయలేదని విమర్శించారు. ఇటీవల రెండు నోటిఫికేషన్లు ఇచ్చినా ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఆ పరీక్షలు అయ్యే పరిస్థితి కనిపించడంలేదన్నారు. మద్యపాన నిషేధమని చెప్పి వాగ్దానం చేస్తే మహిళల బతుకులు బాగుపడతాయని మిమ్మల్ని ఓట్లు వేసి గెలిపిస్తే మాట తప్పిన ముఖ్యమంత్రిగా చరిత్రలో జగన్‌రెడ్డి నిలిచిపోయారని విమర్శించారు. పాదయాత్రలో ఉద్యోగులకు మెరుగైన పిఆర్సితో పాటు సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత సిపిఎస్ రద్దు కాదు కదా పిఆర్‌సి కూడా అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో నిరుద్యోగుల కోసం ట్రైకార్ రుణాలు గతంలో ఇచ్చేవారని వైసిపి ప్రభుత్వం కనీసం ఆ రుణాలు ఇవ్వడం లేదన్నారు. వందకు వంద శాతం గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వచ్చే జీవో 3కు మంగళం పడే గిరిజన ద్రోహిగా జగన్‌రెడ్డి మిగిలిపోయారన్నారు. తప్పుడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించి సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఇలాంటి తప్పుడు హామీలతో ప్రజల్ని ఎన్నాళ్లు మోసగిస్తారని, ప్రజలంతా మీ మోసాన్ని గమనిస్తున్నారని, త్వరలోనే వైసిపికి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయి అన్నారు.

ఐటిడిఎ ఉన్నా సమస్యలు తప్పడం లేదు

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ ఉన్నప్పటికీ గిరిజనులకు సమస్యలు తీరడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.తిరుపతిరావు అన్నారు. మండలంలో సిపిఎం కార్యకర్తల సమావేశం జె.మధుసూదన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 2023 పూర్తయిన సీతంపేట మండలంలోని రహదారులు, జలజీవన్ పనులు, గిరిజన మ్యూజియం, హాస్పిటల్ పనులు పూర్తి కాకుండా ఉన్నాయని విమర్శించారు. అధికారులు సమీక్షలకు పరిమితవుతున్నారు తప్ప పనులు జరగడం లేదన్నారు. ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఉన్నా అభివృద్ధి గూర్చి పట్టించుకోకపోవడం లేదన్నారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేయకపోతే మళ్లీ ఎన్నికల హామీలకే పనులు మిగిలిపోతాయన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎ.భాస్కరరావు, జె.సుందరమ్మ, పి.సాంబయ్య, ఎస్.దుర్గారావు, ఎం.కాంతారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తిరుపతిరావు


వాలంటీర్లకు సూచనలు ఇస్తున్న ఎంపిడిఒ గీతాంజలి

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి సచివాలయాన్ని ఎంపిడిఒ కె.గీతాంజలి మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ ఏ విధంగా జరుగుతుందోనని ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. గ్రామ వాలంటీర్లు విధులు గురించి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువ సర్వీసులు అందించాలన్నారు. సంక్షేమ డిస్ప్లే బోర్డు పరిశీలించారు. ఎంపిడిఒ వెంట కార్యదర్శి జనార్ధనరావు తదితరులు ఉన్నారు.

చిదిమిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమిలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్ కుమార్ మధుమేహం, రక్తపోటు, గర్భిణీలతో పాటు వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి మండల ప్రధాన కార్యదర్శిగా బురిడి

ప్రజాశక్తి - సీతానగరం



వైసిపి మండల ప్రధాన కార్యదర్శిగా అప్పయ్యపేటకు చెందిన బురిడి సూర్యానారాయణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పార్టీ బాధ్యతలు అప్పుజెప్పడం తన కర్తవ్యాన్ని నిర్వహిస్తానని అన్నారు. తనకు ఈ పదవిని అప్పగించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

బావిలో పడి మహిళ మృతి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని కోటిపల్లి గ్రామానికి చెందిన వంగపండు అన్నపూర్ణ (27) బావిలో పడి మృతి చెందింది. మృతురాలి తల్లీ కర్రీ లక్ష్మి చెప్పిన వివరాలు ప్రకారం.. 2019లో కోటిపల్లి గ్రామానికి చెందిన వంగపండు రామారావుకు అన్నపూర్ణను రెండో భార్యగా వివాహం చేశారు. వీరిద్దరూ అదే గ్రామంలో ఇంటిని అద్దెకు తీసుకుని కాపురం చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో గర్భవతి అని కూడా చూడకుండా రామారావు అన్నపూర్ణను కొట్టేవాడు. ఈ నేపథ్యంలో ఆమె పుట్టింటికి వచ్చింది. సర్ది చెప్పి తిరిగి పంపించాను. సోమవారం మా ఇంటి వద్దనే ఉన్న అన్నపూర్ణ, రామారావు కొత్త చెరువు దగ్గర ఉన్న పొలంలో పనికి వెళ్తు దారిలో గొడవలు పడ్డారు. మళ్ళీ సాయంత్రం మా అల్లుడు ఇంటికి వచ్చి మీ అమ్మాయి ఏది అని అడిగాడు. అదేంటి ఇద్దరూ కలిసి ఉదయం పనికి వెళ్లారు కదా మళ్లీ నన్ను అడుగుతున్నావేంటి అని ప్రశ్నించాను. దీంతో ఇంటికి వెళ్లి పోయాడు. వెంటనే మా బంధువులు, ఊరులో వారిని వెంట పెట్టుకొని వెళ్తే నేలబావిలో శవమై కనిపించిందని తల్లి బోరున విలపించింది. మృతురాలికి మూడేళ్ల పాప ఉంది. తెర్లాం ఎస్ఐ రమేష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూపు-2 అభ్యర్థులకు అవగాహన

బొబ్బిలి: గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు యుటిఎఫ్, జెవివి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ సదస్సు యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ అధ్యక్షత వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ మోహనరావు సదస్సును ప్రారంభించి ప్రాముఖ్యతను వివరించారు. ప్రముఖ విద్యావేత్త, పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు రాసిన పుస్తకాన్ని సదస్సుకు హాజరైన వారికి ఉచితంగా పంపిణీ చేశారు.



కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ -23 రద్దు చేయాలని కోరుతూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. స్థానిక న్యాయవాదుల సంఘం అధ్యక్షులు తాడ్డి తిరుపతిరావు ఆధ్వర్యాన న్యాయవాదులు కోర్టు ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందని చెప్పారు. భూములపై ప్రభుత్వ పెత్తనం వహించేలా చట్టం రూపకల్పన చేయడంతో పేదలకు నష్టదాయకమన్నారు. వెంటనే ఈ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు వేణుగోపాలరావు, సభ్యులు కర్రి సన్యాసి రావు, జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అదుపుతప్పి ముందు వాహనాలను ఢీకొన్న లారీ
తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి కొమరాడ

అదుపుతప్పి ముందు వాహనాలను లారీ ఢీకొన్న ఘటన మండలంలోని కోటిపాం రైల్వే గేటు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. కొమరాడ నుంచి పార్వతీపురం వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ రైల్వే గేట్ వద్ద గేటు పడడంతో నిలిపివేశారు. అదే సమయంలో ముందున్న రెండు ఆటోలు ఒక స్కూటీపై అదుపుతప్పిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో స్కూటీలో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటోలో వెళ్లి ముందున్న గేటును ఢీకొనడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సుమారు రెండు గంటల సమయం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే రైల్వే అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని గేటును మరమ్మతులు చేపట్టి ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించారు.



లారీ ఢీకొని నుజ్జయిన స్కూటర్

నాటు సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - కొమరాడ

నాటు సారా ప్యాకెట్లతో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై నీలకంఠరావు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమాచారం మేరకు కుమ్మరిగుంట వద్ద 200 నాటు సారా ప్యాకెట్లతో ఒక వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం వ్యక్తిని కోర్టులో హాజరు పరుస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో నాటు సారా అమ్మకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. నాటుసారా అమ్మకాలు, తరలింపుపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.